క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల సందర్శన



పెద్దకోడూరులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని పెద్ద కోడూరు, చిన్నకోడూరు గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఏపీఎం మహిపాల్ సందర్శించారు. కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు, నిర్వాహకుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఆయన వెంట సీసీలు కొమురయ్య, శ్రీనివాస్ రెడ్డి, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఈ కేవైసీ తప్పనిసరి

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీలోని మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా రూ.500లకు గ్యాస్ సిలిండర్ పొందాలంటే లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అని చిన్నకోడూరు ప్రమీల గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు పోతరాజు సతీష్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన బుక్‌తో హెచ్‌పీ గ్యాస్ కార్యాలయానికి వచ్చి వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం



చెత్తతో నిండిన బస్టాండ్ వెనుక మురికి కాలువ

దుబ్బాక: పట్టణంలో పారిశుద్ధ్యం పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైంది. మురికి కాలువల్లో చెత్త పేరుపోవడంతో మురుగు పారుదల నిలిచిపోయింది. దుర్గంధం వ్యాప్తితో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ వెనుక మురికి కాలువ చెత్తతో నిండిపోయినా శుభ్రం చేయడంలేదని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీఓను అమలు చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి, రేగొండ, మల్చెర్వుతండా, బొడిగెపల్లి, గౌరవెల్లి, జనగామ, కేశవాపూర్, మంచినీళ్లబండ గ్రామాలను హుస్నాబాద్ మండలంలో విలీనం చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విడుదలైన జీఓ తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ ముత్తినేని వేణుగోపాల్ రావు మంగళవారం డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జీఓ అమలు చేసేలా చర్యలు తీసుకోవాని విజ్ఞప్తి చేశారు.

చేర్యాలలో మా ఊరి కథ సినిమా షూటింగ్



సినిమా షూటింగ్‌లో పాల్గొన్న ఆర్టిస్టులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో మా ఊరి కథ సినిమా షూటింగ్‌ని మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సినిమా డైరెక్టర్ అల్వాల కనకరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో సినిమా షూటింగ్ చేయడం సంతోషకరంగా ఉందన్నారు సినిమా షూటింగ్ చేర్యాల పరిసర గ్రామాలలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, నాగుల వెంకటేశం, హీరో ఆర్య, ఆర్టిస్టులు శంకర్ వర్మ, రాజు, రాజేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



రవి

చేర్యాల(సిద్దిపేట): ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొంటి రవిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈయన చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

బడీడు పిల్లల గుర్తింపు సర్వే

- ప్రభుత్వ ఆదేశాలతో సర్వే షురూ
- ఇందు కోసం సీఆర్పీలకు శిక్షణ
- ప్రబంద్ పోర్టల్‌లో పిల్లల వివరాల నమోదు



జగదేవ్‌పూర్‌లో సర్వే చేస్తున్న సీఆర్పీ సిబ్బంది.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి మండలంలోని బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను ప్రారంభించారు. బడీడు పిల్లలు, చదువు మధ్యలో మానేసిన వాళ్లు, నిత్యం పాఠశాలకు రాకుండా ఉండే విద్యార్థులను ఈ సర్వేలో గుర్తిస్తారు. బడీడు బాలబాలికలు చదువుకు దూరం కాకుండా ప్రతీ ఒకరు చదువుకోవాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నారు.

ప్రతీ ఏడాది జనవరిలో..

బడి బయట పిల్లలను గుర్తించే సర్వే ప్రతీ ఏడాది జనవరిలో చేపట్టనుండగా ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నుంచి జనవరి 10 వరకు సర్వే చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికను రూపొందించింది. పాఠశాల స్థాయిలో 6 సంవత్సరాల నుంచి 14 వరకు, కళాశాల స్థాయిలో 15 సంవత్సరాల నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న బాలబాలికలను గుర్తిస్తారు. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. సంచార జాతులకు చెందిన కుటుంబాలవారి పిల్లల చదువు, గ్రామాల్లో ఇంటింటి వెళ్లి పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. ఇలా మండలంలోని 24 గ్రామాల్లో సేకరించనున్నారు.

ప్రతీ విద్యార్థి చదువుకోవాలని..

ప్రతీ విద్యార్థి చదువుకోవాలనేది ప్రభుత్వ లక్ష్యం . ఏటా బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నాం. చదువు మానేసిన పిల్లలను గుర్తించేందుకు సీఆర్పీలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. వారు పిల్లలను గుర్తించి ప్రబంద్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తారు.

– ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ, జగదేవ్‌పూర్

బీసీ గురుకులం ఏర్పాటుకు వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరుపోతుల జనార్దన్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హుస్నాబాద్‌కు వచ్చిన మంత్రిని కలిసిన విద్యార్థి సంఘం నాయకులు విద్యార్థుల సమస్యల గురించి వివరించారు. బీసీ గురుకులం లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు దూర ప్రాంతాలకు పోవాల్సి వస్తోందన్నారు. మంత్రి స్పందించి బీసీ గురుకులం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జనార్దన్ తెలిపారు.

ఉచిత వైద్యశిబిరంతో ప్రజలకు మేలు

మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాకటౌన్: ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరధిలోని ధర్మాజీపేటలో కేపీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేపీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దుబ్బాక బాలకృష్ణ, బత్తుల స్వామి, కనకయ్య, బీఆర్ఎస్ నాయకులు గుండెల్లి ఎల్లారెడ్డి, కిష్టారెడ్డి, భూంరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న స్వరూపారాణి

చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం మంగళవారం సాదాసీదాగా సాగింది. సమావేశంలో ప్రధానంగా పట్టణ పరిధిలోని పలు బోరు మోటార్ల మరమ్మతులు, పత్రికలకు ఇచ్చిన ప్రకటనల బిల్లుల చెల్లింపు, పట్టణ పారిశుధ్య వాహనాల మరమ్మతులకు సంబంధించి అంశాలపై తీర్మానం చేసినట్లు కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, జుబేదా ఖాతున్, ఉడుముల ఇన్నమ్మ, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, సందుల సురేష్, పచ్చిమడ్ల సతీష్, కోఆప్షన్ సభ్యులు ఆరోగ్య రెడ్డి, నాగేశ్వరరావు, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



రోడ్డు మధ్యలో పడిన గుంత

కొండపాక(గజ్వేల్): రోడ్డు మధ్యలోని గుంత ప్రమాదకరంగా ఉంది. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని అంగడి బజార్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో సీసీ రోడ్డు మధ్యలోని గుంతను గమనించిక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ మార్గంలో జనసంచారం ఎక్కువగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుంత పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కేంద్ర పర్యటనలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పర్యటనలో అధికారుల ప్రొటోకాల్ పాటించాలని, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనకపోవడం సరికాదన్నారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కో–ఆర్డినేటర్ దాసరి రాజు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మజార్ మలిక్, పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశాద్, అయూబ్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాస్‌లు అందించాలన్నారు. మండలంలో రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలోని బగలాముఖీ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం చివరి మంగళవారం అమావాస్య సందర్భంగా వేద పండితుడు, ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ, పలువురు ప్రముఖులు ఉన్నారు.

నిరుపేదలకు వరం రాజీవ్ ఆరోగ్యశ్రీ

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి

రామాయంపేట(మెదక్): రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.పది లక్షలకు పెంచడం పేద రోగులకు ఎంతో ఉపయోగం అని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రి డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందితో ఆరోగ్యశ్రీ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ .. ఈ పథకం నిరుపేదలకు వరంలాంటిదని, ఈ విషయమై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుప్రియ, జయలక్ష్మి, మణికంఠ, సిబ్బం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలి

గజ్వేల్ అదనపు సీఐ రంగకృష్ణ



ప్రజ్ఞాపూర్ జెడ్పీబాలికల హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు సీఐ రంగకృష్ణ

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలని గజ్వేల్ అదనపు సీఐ రంగకృష్ణ అన్నారు. మంగళవారం ప్రజ్ఞాపూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నేరాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్ అండ్ బాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరిగే మంచిచెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, ఉన్నత శిఖరాలను అధిరోహించినపుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ తమకంటూ మంచి గుర్తింపు సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ అధికారులమని ఫోన్ చేసినా, తమ సెల్ ఫోన్లకు వచ్చే ఓటీపీ నంబర్లు ఇతరులకు చెపొద్దన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా షీ టీమ్(87126673443) నంబరుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారద, గజ్వేల్ షీటీమ్ సభ్యులు శ్రీరాములు, రామచంద్రారెడ్డి, మహేష్, శ్యామల, లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

సిద్దిపేట అర్బన్: విద్యార్థులు చదువుకునే దశలో బాల్యవివాహాలు చేసుకొని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, చదువులో రాణించి సమాజంలో ఉన్నతంగా జీవించాలని సిద్దిపేట టూ టౌన్ సీఐ రవికుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ దిశగా కష్టపడాలన్నారు. మానవ అక్రమ రవాణా గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్స్‌ను అవసరం మేరకు వినియోగించాలని, సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళల రక్షణకు ఎల్లప్పుడు షీ టీం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి క్రికెట్ లీగ్ టోర్నీ

బెజ్జంకి(సిద్దిపేట): 40 ఏళ్లుగా ఏటా నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను ఈనెల 20వ తేదీ నుంచి బెజ్జంకిలో నిర్వహించనున్నట్లు బెజ్జంకి క్రికెట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బీసీసీఐ నిబంధనల మేరకు క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఆసక్తి గల జట్లు వివరాలకు 94904 48271, 70936 66546, 95339 80726, 88978 41366 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్, ఎల్కతుర్తి జాతీయ రహదారిపై విద్యుత్ 11 కేవీ, 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట రూరల్ సబ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. బుధవారం మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

వాహనం అడ్డగించి.. డబ్బు దోపిడీ

సిద్దిపేటఅర్బన్: గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందంటూ వాహనాన్ని ఆపిన గుర్తుతెలియని వ్యక్తులు డ్రైవర్ వద్ద ఉన్న నగదును అపహరించారు. ఈ ఘటన మంగళవారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగధాంపల్లి వద్ద జరిగింది. త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లికి చెందిన పస్తం అంజయ్య వాహనంలో హైదరాబాద్ చర్లపల్లి నుంచి జగిత్యాల జిల్లా కోరుట్లకు పరుపుల లోడుతో వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం 3 గంటల సమయంలో రంగధాంపల్లి వద్ద బంకులో డీజిల్ పోయించుకొన్నాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత ముగ్గురు వ్యక్తులు నంబర్ ప్లేట్ లేని మోపెడ్‌పై వచ్చి వాహనాన్ని అడ్డగించారు. ఎందుకు ఆపాలని డ్రైవర్ ప్రశ్నించగా గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం వచ్చిందని వాహనాన్ని తనిఖీ చేయాలని బుకాయించారు. భయపడిన డ్రైవర్ వాహనంలో ఉన్న రూ.40 వేలను చేతిలో పట్టుకోగా వాటిని లాక్కొని అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గజ్వేల్‌లోని పోస్టాఫీస్ వద్ద నినాదాలు చేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు

గజ్వేల్‌రూరల్: గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గ్రామీణ తపాల ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా సిద్దిపేట సబ్‌డివిజన్ పరిధిలోని గజ్వేల్‌లో మంగళవారం ఐఓసీలోని తపాలా(పోస్టాఫీస్) కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఎనిమిది గంటల పని, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు సర్వీస్ వారీగా అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలు, గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలని, చెల్లింపు సెలవులు నగదుగా మార్చుకునే సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా జీడీఎస్, వారి కుటుంబ సభ్యులకు వైద్యసదుపాయం కల్పించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలు చేయాలని, ఇన్సెంటివ్, కమీషన్ పద్ధతి రద్దు చేసి ప్రతి పనిని వర్క్‌లోడ్‌కు తీసుకోవాలన్నారు. టార్గెట్స్, మేళాల రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ తపాల ఉద్యోగులు నాగరాజు, సంతోష్ కుమార్, రామకృష్ణ, చంద్రశేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణంపై సందిగ్ధం

ఇంకా ఫైనల్ కాలేదంటున్న అధికారులు



మాట్లాడుతున్న రైతులు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బూరుగుపల్లి, ఎన్సాన్‌పల్లి గ్రామాల మీదుగా సిరిసిల్ల నుంచి సూర్యాపేట వరకు ఫోర్ లేన్ రోడ్డు మంజూరైందనే ప్రచారంతో తాము గందరగోళంలో ఉన్నామని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఫోర్ లేన్ రోడ్డు ఏ సర్వే నంబర్ల మీదుగా వెళ్తుంది, నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎక్కడి నుంచి వెళ్తుందని అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. తమ భూముల గుండా రోడ్డు నిర్మాణం కానుందని పలువురు ప్రచారం చేస్తున్నారని, దీంతో తమకు ఏమీ అర్థం కావడం లేదని వాపోయారు. ఈ విషయమై నేషనల్ హైవే అథారిటీ అధికారులను వివరణ కోరగా సిరిసిల్ల నుంచి సూర్యాపేట వరకు రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన అలైన్‌మెంట్‌పై కేంద్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం డీపీఆర్ దశలోనే ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.

కేసీఆర్‌కు ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శ



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. తుంటికి గాయం కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నామని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సునీతారెడ్డి తెలిపారు.